సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 26 । జూన్ । 2023



'నకిలీ' గండం గట్టెక్కేనా?

ఇటీవల వర్షాలకు రైతులు విత్తనాలు విత్తుతున్నారు. అదే అదునుగా మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. 8లో



క్రీడా స్ఫూర్తి చాటాలి

విద్యుత్ ఉద్యోగులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, పోటీతత్వం వ్యక్తిత్వానికి ఎంతో అవసరమని జెన్‌కో సీఎండీ అన్నారు. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 30° / 24°

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. అనంతరం నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

సలహాల బాక్సులు ఏర్పాటు

ఆలయ ఈఓ ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో భక్తుల వసతులు మెరుగుపర్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఆలయంలో జరిగే ఆర్జిత సేవలు, అందే వసతులను గురించి తెలిపేలా రాజగోపురం ఎదురుగా ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భక్తుల నుంచి సలహాలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు టికెట్ల విక్రయ కౌంటర్ల వద్ద ప్రత్యేక బాక్సులను ఏర్పాటు చేశారు.

పర్ణశాల రామయ్య సేవలో ఆర్టీసీ చైర్మన్

దుమ్ముగూడెం: పర్ణశాల రామాలయాన్ని టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భవానీ ప్రసాద్, భద్రాచలం డిపో మేనేజర్ రామారావు, కొత్తగూడెం డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కేశవ్ ఉన్నారు.

శ్రీకనకదుర్గమ్మ తల్లికి విశేష పూజలు



బోనాలతో తరలివస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. కేశవాపురం గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈఓ. ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ డైరెక్టర్లు చందువట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, కిలారు నాగేమల్లేశ్వరరావు, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 10 మంది అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 10 మంది అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో అడిషనల్ జీఎంలు ముగ్గురు, డీవైజీఎంలు ముగ్గురు, అడిషనల్ మేనేజర్లు ముగ్గురు, డిప్యూటీ మేనేజర్ ఒకరు ఉన్నారు. వీరందరూ వచ్చే నెల 4వ తేదీలోపు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో యాజమాన్యం పేర్కొంది.

డైరెక్టర్‌కు సన్మానం

సింగరేణి ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా రూ.55 లక్షల సౌకర్యం వర్తించేలా కృషి చేసినందుకు శనివారం రాత్రి డైరెక్టర్(పా) ఎస్.బలరాంను గాంధీపథం ఆధ్వర్యంలో సన్మానించారు. కన్వీనర్ చింతలచెరువు గోర్షెము, గొల్లపెల్లి ప్రేమానందం, అరుణ, పుష్పమ్మ, మహ్మద్ రఫీ, ఈశ్వరయ్య, అఫ్జల్, వీరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో పఠనోత్సవాలు

జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి పఠనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10 తరగతి వరకు వచ్చే నెల 31వ తేదీ వరకు పఠనోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. రోజూ ఒక పీరియడ్ కథల పుస్తకాలు, బాల సాహిత్యం చదవాలని సూచించారు. ఇప్పటికే 154 ప్రాథమిక పాఠశాలలకు , 55 ప్రాథమికోన్నత పాఠశాలలకు, 67 ఉన్నత పాఠశాలలకు కథల పుస్తకాలు సరఫరా చేశామని, గ్రంథాలయ నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చామని వివరించారు. దాతల సహాయంతో పాఠశాలల్లోని గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. జూలై చివరి వారంలో పఠనోత్సవాలపై జిల్లాస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు.

పెట్టుబడి పైసలొచ్చే..



నేటి నుంచి బ్యాంక్ ఖాతాల్లోకి 'రైతుబంధు'

- వానాకాలం సీజన్‌లో 1,42,199 మంది రైతులకు సాయం
- జిల్లాలో జమ కానున్న సొమ్ము రూ. 213.85 కోట్లు
- పోడు పట్టాలు పొందే వారికి వచ్చే నెలలో రైతుబంధు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యవసాయ పెట్టుబడి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రైతుబంధు పథకం కింద వానాకాలం సీజన్‌కు సంబంధించి నేటి నుంచి ఆర్థికసాయం అందనుంది. ఎకరానికి రూ.5 వేల చొప్పున సోమవారం నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నారు. జిల్లాలో 1,42,199 మంది రైతులకు మొత్తం రూ 213.85 కోట్లను దశలవారీగా అందించనున్నారు. నూతనంగా మరో 44,038 మంది రైతులకూ జూలై మాసంలో రైతుబంధును వర్తింపజేయనున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి పోడు సాగుదారులకు పట్టాల పంపిణీ చేయనున్నారు. వారికీ ఈ సీజన్ నుంచే రైతుబంధు వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. దీంతో పట్టాలు పొందిన పోడు సాగుదారులకు కూడా పెట్టుబడి సాయం అందనుంది. ఇప్పటికే వ్యవసాయ కమిషనరేట్ నుంచి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. వచ్చే నెల 3వ తేదీ వరకు పోడు పట్టాదారుల వివరాలను ఏఈఓల ద్వారా పోర్టల్‌లో అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తంగా 1,86,237 మందికి రైతుబంధు అమలుకానుంది. వీరిలో 1,20,163 మంది రైతులు, 22,036 మంది ఆర్ఓఎఫ్ఆర్ రైతులు ఉన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులు 1,20,163 మందికి రూ.174.44 కోట్లు, 22,036 ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు రూ.39.41 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక పోడు సాగు ఉన్న జిల్లాలో 1,59,902 ఎకరాలకు రైతుబంధు సాయం జూలై మాసంలో పంపిణీ చేయనున్నారు. 44,038 మంది పోడు సాగుదారులు రైతుబంధు సాయం అందనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా పోడు సాగుదారులు ఇలా..

పాల్వంచ మండలంలో 1,369 మంది పోడు సాగుదారులు ఉన్నారు. బూర్గంపాడు మండలంలో 1,593, లక్ష్మీదేవిపల్లి 1,574, ఆళ్లపల్లి 2,099, అన్నపురెడ్డిపల్లి 618, ఇల్లెందు 5,033, చంద్రుగొండ 699, కరకగూడెం 1,585, అశ్వారావుపేట 3,067, ములకలపల్లి 3,220, టేకులపల్లి 4,251, దమ్మపేట 1,118, గుండాల 4,320, జూలూరుపాడు 1,517, మణుగూరు 857, చర్ల 1,971, అశ్వాపురం 2,454, చుంచుపల్లి 55, సుజాతనగర్ 978, పినపాక 1,304, దుమ్ముగూడెం మండలంలో 4,356 మంది.. మొత్తం జిల్లాలో 44,038 మంది పోడు పట్టాదారులు కూడా రైతుబంధు పొందనున్నారు.

జిల్లాలో మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు

మండలం	రైతుల సంఖ్య	రైతుబంధు సొమ్ము (రూ.లలో)
అన్నపురెడ్డిపల్లి	4,148	5,60,98,719
అశ్వారావుపేట	10,607	20,22,85,419
చంద్రుగొండ	5,327	6,55,90,933
దమ్మపేట	10,642	20,43,19,091
ములకలపల్లి	7,747	12,86,32,602
భద్రాచలం	113	21,41,597
చర్ల	10,334	11,93,18,817
దుమ్ముగూడెం	12,825	18,44,17,075
చుంచుపల్లి	717	81,44,001
జూలూరుపాడు	9,109	11,65,92,794
కొత్తగూడెం	277	28,08,490
లక్ష్మీదేవిపల్లి	3,179	5,02,10,563
పాల్వంచ	5,965	8,41,69,666
సుజాతనగర్	6,059	6,74,16,094
ఆళ్లపల్లి	3,363	7,42,45,750
అశ్వాపురం	6,200	8,05,24,772
బూర్గంపాడు	6,765	8,84,68,713
గుండాల	5,086	10,95,58,010
కరకగూడెం	3,828	6,25,97,582
మణుగూరు	2,784	3,03,63,145
పినపాక	5,702	6,85,71,375
టేకులపల్లి	11,149	18,24,64,692
ఇల్లెందు	10,273	14,95,44,501
మొత్తం	1,42,199	213,84,84,401

పోడు సాగుదారులకు ఈ సీజన్ నుంచే అమలు



నేటి నుంచి రైతుల అకౌంట్లో పెట్టుబడి సాయం జమ అవుతుంది. పోడు పట్టాలు పొందే వారికీ ఈ వానాకాలం సీజన్ నుంచే రైతుబంధు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టాల పంపిణీ ప్రక్రియ పూర్తయిన తర్వాత వారి వివరాల అప్లోడ్ చేస్తాం. ఆ తర్వాత వారికి కూడా రైతుబంధు సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

–కొర్ప అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

గిరిజనుల కల సాకారం..

- 30న పోడు రైతులకు పట్టాల పంపిణీ
- నాడు వైఎస్సార్.. నేడు కేసీఆర్ హయాంలో..
- 50,595 మందికి హక్కు పత్రాలు జారీ

చుంచుపల్లి: దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోడు సాగు రైతుల కల సాకారమయ్యే సమయం ఆసన్నమైంది. ప్రభుత్వం ఈ నెల 30న గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో గిరిజన రైతులకు పోడు హక్కు పత్రాలు అందజేశారు. మళ్లీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పట్టాల పంపిణీ ప్రక్రియ చేపట్టింది. జిల్లాలో ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావుతోపాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కూడా హాజరుకానున్నారు. జిల్లాలో 50,595 మంది పోడు రైతులకు 1,51,195 ఎకరాలకు సంబంధించి పోడు పట్టాలతో పాటు పాసు పుస్తకాలు అందజేయనున్నారు. పట్టాలు పొందిన రైతులకు ఈ వానాకాలం నుంచే రైతుబంధు, రైతు బీమా పథకాలను వర్తింపజేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 2021 చివరలో గిరిజనులు, గిరిజనేతరుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. వీటిని ఎఫ్ఆర్‌సీ కమిటీల ఆధ్వర్యంలో గతేదాది అక్టోబర్‌లో పోడు భూములపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ ప్రక్రియలో గిరిజనులకు మాత్రమే అవకాశం కల్పించి పట్టాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో వచ్చిన దరఖాస్తులపై రెండు దఫాలుగా అధికారులు కసరత్తు చేసి అర్హులను గుర్తించారు. జిల్లాలో ప్రతి ఏటా హరితహారం సందర్భంగా పోడు భూములపై గ్రామాల్లో అటు అటవీ అధికారులకు, ఇటు గిరిజనులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎట్టకేలకు సర్కారు ముందుకు రావడంతో త్వరలోనే పోడు పోడు సమస్య సమసిపోయే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

గతంలో 87,265.57 ఎకరాలకు పట్టాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో తొలిసారి పోడు రైతులకు హక్కు పట్టాలను జారీ చేశారు. దివంగత నేత పాదయాత్ర సందర్భంగా పోడు సాగుదారుల గోడు విని ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చాక పట్టాల పంపిణీ చేపట్టారు. ఆ సమయంలో పోడు పట్టాల కోసం జిల్లా నుంచి 2,03,434.66 ఎకరాలకుగాను, 49,344 దరఖాస్తులు వచ్చాయి. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాత అధికారులు 1,16,169.09 ఎకరాల పరిధిలో 24,710 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 24,634 దరఖాస్తుల పరిధిలో 87,265.57 ఎకరాలకు అనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పోడు పట్టాలను జారీ చేసింది. ఇందులో అత్యధికంగా ఇల్లెందు నియోజకవర్గ పరిధిలో 10,173 మంది రైతులు ఉండగా, అత్యల్పంగా వైరా నియోజకవర్గం పరిధిలోని జూలూరుపాడులో 1,166 మంది సాగుదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అప్పట్లో స్వయంగా సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి 2009, ఆగస్టు 9న జిల్లాలో పర్యటించి పోడు సాగుదారులకు పట్టాలను అందజేశారు. మళ్లీ 13 ఏళ్ల తర్వాత స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పోడు పట్టాల పంపిణీ జరగనుంది. ప్రస్తుతం జిల్లాలో పోడు పట్టాల కోసం 83,341 దరఖాస్తులు రాగా, వాటి పరిధిలో 2.97 లక్షల ఎకరాల భూమి సాగులో ఉందని గుర్తించారు. ఇందులో 65,616 గిరిజనుల దరఖాస్తులు కాగా, మరో 17,725 గిరిజనేతరులవి ఉన్నాయి. పరిశీలన అనంతరం గిరిజన రైతులకు సంబంధించిన 50,595 దరఖాస్తులకు డీఎల్సీ (జిల్లా స్థాయి కమిటీ) ఆమోద ముద్ర వేసింది. ఈ దరఖాస్తుల పరిధిలో 1,51,195 ఎకరాల భూములకు ఈ నెల 30న పోడు పట్టాలు జారీ చేయనున్నారు. జిల్లాలో చేపట్టబోయే పోడు పట్టాల జారీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



అటవీ అధికారులను అడ్డుకుంటున్న సాగుదారులు (ఫైల్)

గిరిజనులకు అందించే పోడు పట్టాల వివరాలు ఇలా

నియోజకవర్గం	ప్రస్తుతం	2009లో
పినపాక	15,971	5,143
ఇల్లెందు	12,445	10,173
అశ్వారావుపేట	9,363	2,757
భద్రాచలం	6,508	2,008
కొత్తగూడెం	4,508	3,387
వైరా	1,800	1,166

రైతుల అకౌంట్లలో నష్టపరిహారం

సూపర్‌బజార్(కొత్తగూడెం): గత మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించింది. మార్చి 17 నుంచి 21వ తేదీ వరకు అకాల వర్షంతో పంట నష్టం జరగ్గా, పలుచోట్ల సీఎం కేసీఆర్ స్వయంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఎకరానికి రూ.10 వేల పరిహారం ఇస్తామని ప్రకటించారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, పంట నష్టం వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపారు. జిల్లాలో 8 మండలాల్లో 2,009 మంది రైతులకు సంబంధించి పంట నష్టం జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం వారికి రూ.1,49,52,500 పరిహారం రైతుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేసింది. ఆళ్లపల్లి మండలంలో ఇద్దరు రైతులకు రూ.27,500, బూర్గంపాడులో ఇద్దరు రైతులకు సంబంధించి రూ.79,000, గుండాలలో 72 మందికి రూ. 5,74,250, జూలూరుపాడులో 8మంది రైతులకు రూ.80,000, లక్ష్మీదేవిపల్లిలో 10మంది రైతులకు రూ.82,500, పాల్వంచలో 60 మంది రైతులకు రూ.4,40,000, టేకులపల్లిలో 292 మంది రైతులకు రూ.27,35,000, ఇల్లెందులో 1,556 మంది రైతులకు రూ.1,08,34,250 నష్టపరిహారాన్ని అందజేశారు. కాగా ప్రధానంగా అకాల వర్షాలకు మొక్కజొన్న, జొన్న, మామిడి, మినుము, పత్తి, పెసర, వరి, చెరకు, పొగాకు రైతులకు పంటనష్టం సంభవించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33శాతం కంటే ఎక్కువ నష్టం జరిగితేనే పరిహారం పొందేందుకు అర్హులు. దీంతో చాలామంది రైతులు నిబంధనలు ప్రతిబంధకాలుగా మారి నష్టపోయారు.

బోనమెత్తిన ఇల్లెందు ఎమ్మెల్యే



బోనమెత్తుకుని వస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: మండలంలోని చింతలంక పంచాయతీ రాజుతండాలో ఆషాఢమాసంలో భాగంగా ఆదివారం ముత్యాలమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ బోనమెత్తుకుని ఊరేగింపులో పాల్గొనగా, స్థానిక మహిళలు బంజారా వేషధారణలో స్వాగతం పలికారు. సర్పంచ్ భూక్యా రతన్‌లాల్ పాల్గొన్నారు.

భద్రాద్రి నుంచి సరిహద్దు రాష్ట్రాలకు సేవలు

ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్య క్షేత్రమైన భద్రాచలం నుంచి సరిహద్దు రాష్ట్రాలతోపాటు మెట్రో నగరాలకు టీఎస్ ఆర్టీసీ సేవలు విస్తరింపజేస్తామని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. భద్రాచలం ఆర్టీసీ డిపో, బస్టాండ్లను ఆదివారం ఆయన పరిశీలించి మొక్కలు నాటారు. అంతకుముందు శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టీసీకి ఆదాయం వచ్చే ప్రతి మార్గాన్నీ వదులుకోకుండా సంస్థ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చర్యలు చేపడతామని చెప్పారు. భద్రాచలం డిపో నుంచి ప్రత్యేక డీలక్స్ బస్సులను మెట్రో నగరాలకు నడిపేలా ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న భద్రాచలం బస్టాండ్‌లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పీఆర్‌సీ అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భవానీ ప్రసాద్, డిపో మేనేజర్ బి.రామారావు, కొత్తగూడెం డీఎం బి. వెంకటేశ్వరరావు, సీఐలు శ్రీనివాసరావు, గౌతమి పాల్గొన్నారు.



భద్రాచలం రామాలయంలో బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు

డ్రైవరన్నా.. చలో సిరిసిల్ల..!

- హెవీ లైసెన్స్ రెన్యూవల్ కావాలంటే తప్పనిసరి
- అక్కడకు వెళ్తేనే టీఐడీఈఎస్ సర్టిఫికెట్.. ఆపై స్లాట్ బుకింగ్
- సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- దూరాభారం కావడంతో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే సుమారు 20 వేల మంది...

సత్తుపల్లి: హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లు రెన్యూవల్ చేసుకోవడం భారమవుతోంది. గతంలో ఎక్కడికక్కడ రవాణా శాఖ కార్యాలయంలో లైసెన్స్ రెన్యూవల్ చేసేవారు. కానీ గత మే నెల నుంచి రెన్యూవల్ స్లాట్ బుక్ చేసుకోవాలంటే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్(టీఐడీఈఎస్)ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇంతవరకూ బాగానే ఉన్నా ఈ సర్టిఫికెట్ జారీకి శిక్షణ కేంద్రం రాష్ట్రం మొత్తం మీద రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మాత్రమే ఉంది. దీంతో కనీసం రెండు రోజులు కేటాయిస్తే తప్ప అక్కడకు వెళ్లి వచ్చే పరిస్థితి లేకపోవడంతో డ్రైవర్లు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు.



సిరిసిల్లలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్

రాష్ట్రమంతటా ఒకటే ట్రాక్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇరవై ఎకరాల విస్తీర్ణంలో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్(టీఐడీఈఎస్)ను ఏర్పాటుచేశారు. ఇక్కడ ఇంటర్నేషనల్ డ్రైవింగ్ ట్రాక్ నిర్మించటంతో డ్రైవర్‌కు ఒకరోజు జాతీయ, రాష్ట్రీయ రహదారులపై డ్రైవింగ్‌లో మెళకువలు, సిగ్నలింగ్ సిస్టమ్‌పై శిక్షణ ఇస్తారు. ఆన్‌లైన్ తరగతుల ద్వారా జాతీయ రహదారిపై ఎంత వేగంగా వాహనం నడపాలో వివరించి టీఐడీఈఎస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే హెవీ డ్రైవింగ్ లైసెన్సు రెన్యూవల్ చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లభిస్తుంది. గతంలో దీనిని పెద్దగా పరిగణనలోకి తీసుకోకున్నా ఈ ఏడాది మే నెల నుంచి ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో రాష్ట్రమంతటా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు తప్పనిసరిగా సిరిసిల్ల వెళ్లాల్సి వస్తోంది. వాస్తవానికి ఇది మంచి కార్యక్రమనే ప్రశంసలు వస్తున్నా.. దూరం కావటం వల్లే డ్రైవర్ల నుంచి వ్యతిరేకత వస్తోంది. కాగా, కొత్త హెవీ లైసెన్సులు మాత్రం ఎక్కడికక్కడ ఎంవీఐ కార్యాలయాల్లోనే జారీ చేస్తున్నారు.


సిరిసిల్ల వెళ్లాలంటే..

రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు టీఐడీఈఎస్ సర్టిఫికెట్ కోసం సిరిసిల్ల వెళ్లాల్సి రావడం దూరాభారమేనని చెప్పాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లా డ్రైవర్లను తీసుకుంటే సరైన రవాణా సౌకర్యం లేక ఒక రైలు, ఒక బస్సు లేదంటే రెండు బస్సులు మారాల్సి ఉంటుంది. దీనికి తోడు ఆ ప్రాంతం కొత్తది కావటంతో డ్రైవర్లు ఇబ్బంది పడుతుండగా.. కనీసం రూ.3 వేలకు పైగా వ్యయమవుతోంది. ఇక సిరిసిల్ల ట్రాక్ వద్ద రోజుకు కేవలం 300 మందికి మాత్రమే శిక్షణ ఇచ్చే అవకాశం ఉండడంతో డ్రైవర్లు అక్కడికి వెళ్లాక ఎప్పుడు పిలుస్తారో తెలియక పడిగాపులు పడాల్సి వస్తోంది.

మినహాయింపు ఇవ్వండి..

రెండు, మూడు జిల్లాలు కలిపి వంద కిలోమీటర్ల పరిధిలో ఎక్కడికక్కడ ఇంటర్నేషనల్ డ్రైవింగ్ ట్రాక్‌ను నిర్మిస్తే తమకు అందుబాటులో ఉంటుందని డ్రైవర్లు అంటున్నారు. సిరిసిల్ల దూరాభారం కావడంతో కొత్తగా మరిన్ని డ్రైవింగ్ ట్రాక్‌లు అందుబాటులోకి వచ్చే వరకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్‌కు టీఐడీఈఎస్ సర్టిఫికెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డ్రైవర్లు, లారీ యజమానుల నుంచి డిమాండ్ వస్తోంది. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారు సుమారు 20వేల మంది ఉంటారనేది అంచనా.

డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు..



సత్తుపల్లి నుంచి సిరిసిల్లకు వెళ్లాలంటే కనీసం రానుపోను రెండురోజులు పడుతుంది. ఖర్చు రూ.5వేల వరకు వస్తుంది. దీంతో డ్రైవర్లు హెవీ లైసెన్స్ రెన్యూవల్‌కు వెళ్లడానికి వెనుకాడుతున్నారు. రెన్యూవల్ చేయించుకోకుండా ఏదైనా జరగరానిది జరిగితే యజమానితో సహా బాధితులు కూడా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం పునరాలోచన చేసి పాత పద్ధతిలోనే రెన్యూవల్‌కు అవకాశం ఇవ్వాలి.

– కొండపల్లి రమేష్‌రెడ్డి, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు, సత్తుపల్లి

ఇది ప్రభుత్వ పాలసీ..



సిరిసిల్లలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ ట్రాక్ ఉండటం వల్ల హెవీ డ్రైవింగ్ రెన్యూవల్ లైసెన్సు హోల్డర్‌కు మంచి శిక్షణ ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ రహదారుల ప్రమాణాలు, వేగం, సిగ్నలింగ్ వ్యవస్థపై సంపూర్ణ అవగాహన కల్పిస్తారు. ఇక టీఐడీఈఎస్ సర్టిఫికెట్ అనేది ప్రభుత్వ పాలసీ. డ్రైవర్లకు మేలు జరిగేది కావడం, ట్రాక్ సిరిసిల్లలోనే ఉండడంతో డ్రైవర్లను అక్కడకు పంపించాల్సి వస్తోంది.

– దారా మనోహర్, ఎంవీఐ, సత్తుపల్లి

క్లుప్తంగా

మోదీ పథకాలతోనే అభివృద్ధి

చర్ల: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే దేశం అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి అన్నారు. కేంద్రంలో మోదీ రెండోమారు పాలన చేపట్టి దేశంలో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గడప గడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం చర్లలోని లక్ష్మీకాలనీ, విజయకాలనీ ప్రాంతాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నాయకులు బిట్రగుంట శ్రాంతికుమార్, సంతపురి సురేష్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పుగాకు పూర్ణచంద్, నాయకులు శేషగిరిరావు, ముత్తారం రత్తయ్య, కొండేటి చంద్రశేఖర్, రాచకొండ అనీల్, మచ్చా కుమార్, కేత సంతోష్, శరత్, సాయిరాం, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని బస్టాండ్ ఏరియాకు చెందిన జనార్దన్‌పై చీటింగ్ కేసు నమోదైంది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే ఏరియాకు చెందిన కాంతమ్మ అనే మహిళ వద్ద జనార్దన్ మెట్టభూమి లీజుకు తీసుకున్నాడు. లీజు డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు ఆ భూమిలోని జామాయిల్ కట్టెను కూడా వారికి తెలియకుండా అమ్ముకున్నాడు. దీంతో కాంతమ్మ కుమారుడు రఘు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు..

మండలంలోని సుభాస్‌నగర్‌కు చెందిన అనంతయ్య తన కూతురు సునిత, మనుమరాలు కుషిలు గత నెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదని అందజేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పశువులు తరలిస్తున్న వారిపై...

ఇల్లెందు: మోరంపల్లి బంజర నుంచి ఖమ్మంకు పశువులను తరలిస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా వాహనంలో నాలుగు పశువులను తరలిస్తున్న విషయాన్ని గమనించిన పోలీసులు ఇల్లెందు కరెంట్ ఆఫీస్ వద్ద ఉన్న చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా వధింపు కోసం మోరంపల్లిబంజర నుంచి ఖమ్మానికి తరలిస్తున్నారని గుర్తించి వాహనాన్న సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పశువులను గోశాలకు తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ..

వ్యక్తికి తీవ్రగాయాలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని సింగరేణి ఉమెన్స్ కాలేజీ సమీపంలో ఆదివారం లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం నుంచి దమ్మపేటకు వెళ్తున్న లారీ హెడ్ ఆఫీస్ ఏరియా సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల సమీపానికి రాగానే మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా కొత్తగూడెం వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న పసుపర్తి జనార్ధనరావుకు ఎడమకాలికి, భుజానికి గాయాలుకావడంతో ఆస్పత్రి తరలించారు. జనార్దన్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ ప్రణయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.


వినాయకపురంలో చోరీ

నగదు, బంగారు ఆభరణాలు అపహరణ

అశ్వారావుపేటరూరల్: ఒకే ఇంట్లో ఉన్న రెండు వేర్వేరు పోర్షన్లలో చోరీ జరిగిన సంఘటన మండలంలోని వినాయకపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన ఎస్.కే. గఫూర్, అశ్వారావుపేటకు చెందిన జల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తులు ఒకే ఇంట్లో ఉన్న రెండు వేర్వేరు పోర్షన్లలో అద్దెకు ఉంటున్నారు. ఇరువురు సాయంత్రం వేర్వేరుగా పనిపై అశ్వారావుపేటకు వచ్చి, తిరిగి వెళ్లేసరికి రెండు పోర్షన్ల తలుపుల తాళాలు ధ్వంసం చేసి కనిపించాయి. దీంతో లోపలి వెళ్లి చూడగా శ్రీనివాసరావు ఇంట్లో బీరువాలో ఉన్న రూ.10వేల నగదు, రూ.50వేల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, అలాగే గఫూర్ ఇంట్లో బీరువాలో ఉన్న రూ.50వేల విలువగల బంగారు, వెండి ఆభరణాలు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. ఈ చోరీ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. చోరీ ఘటనలపై తమకు బాధితుల నుంచి ఫిర్యాదులు రాలేదని స్థానిక ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చర్ల రోడ్డులో గల ఓ ఇంట్లో ముగ్గురు విద్యార్థులు అద్దెకు నివసిస్తున్నారు. అందులో ఓ వ్యక్తిగా ఉంటున్న ఎటపాకలో ఉన్న ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న రమేష్ (20) ఆదివారం కళాశాలలో చేరతానని కుటుంబసభ్యులతో చెప్పి శనివారం భద్రాచలం వచ్చాడు. తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, రమేష్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంకు చెందిన వాడిగా పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం రమేష్ మృతదేహాన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మార్చురీలో ఉంచారు. కాగా, విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

‘నకిలీ’ గండం గట్టెక్కేనా?

కల్తీ విత్తనాలతో.. తస్మాత్ జాగ్రత్త

- ఏటా రైతులపై నకిలీ పోటు
- కమీషన్ పేరుతో మోసగిస్తున్న దళారులు
- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్న వైనం
- దిగుబడి తగ్గి నష్టపోతున్న రైతాంగం
- సాగులో సస్యరక్షణ చర్యలు అవసరమంటున్న అధికారులు



విత్తనాలు విత్తుతున్న కూలీలు

పాల్వంచరూరల్: తొలకరి వర్షాలు ఈ సారి ఆలస్యంగా వచ్చాయి. ఆశించిన స్థాయిలో ఖరీఫ్‌వర్షాలు లేకపోగా చిరుజల్లులతో అన్నదాతలు విత్తనసాగుకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో వరి ధాన్యం తర్వాత ప్రధానంగా వాణిజ్యపంటలైన పత్తి, మొక్కజొన్న పంటలు అధికంగా సాగవుతాయి. గత రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు దుక్కులు దున్ని సేంద్రీయ ఎరువులు వేసుకొని సగం విస్తీర్ణంలో విత్తనాలను విత్తారు. ఈ నేపథ్యాన రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న దళారులు మార్కెట్లోకి నకిలీ విత్తనాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన పత్తి బీజీ 3 విత్తనాలను కూడా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతులకు వరి విత్తనాలు మాత్రమే ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తోంది. మిగిలిన పత్తి, ఇతర రకాల విత్తనాలను రైతులు వ్యాపారులపై ఆధారపడుతున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు కమీషన్ ఎరగా చూపి ఊరు, పేరులేని, నాణ్యత లోపం కలిగిన విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్ర, గుంటూరు, వరంగల్, తదితర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలను తీసుకొచ్చి రైతులకు విక్రయిస్తూ నిండా ముంచుతున్నారు.

గతంలో మోసపోయిన సంఘటనలు..

ప్రతి ఏటా నకిలీ విత్తనాల కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా.. నకిలీ విత్తనాల బారిన పడి రైతాంగం నష్టపోతూనే ఉంది. గతేడాది పాల్వంచలో నాణ్యత లేని విత్తనాలను విక్రయించిన నలుగురి వ్యాపారులపై వ్యవసాయశాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. అంతేకాక 2017లో పాండురంగాపురంతో పాటు దాని చుట్టు పక్కల గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాలతో సుమారు 150 మంది రైతులు నష్టపోయిన దాఖలాలు ఉన్నాయి. ఈ విషయమై అప్పటి కలెక్టర్, వ్యవసాయ అధికారులకు ఫిర్యాదులు చేయడంతో పాటు బాధిత రైతులకు న్యాయం చేయాలని గ్రామంలో దీక్షలు కూడా చేపట్టారు. అయినా నేటికి న్యాయం జరగలేదు. ఈ నేపథ్యాన విత్తనాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, లైసెన్స్ ఉన్న వ్యాపారుల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా సాగు వివరాలిలా..

పంట రకం	గతేడాది (ఎకరాల్లో)	ప్రస్తుతం (వ్య.శా. అంచనా)
వరి	1,64,266	1,65,025
పత్తి	1,62,100	2,14,302
మొక్కజొన్న	50,910	60,250
మిర్చి	25,000	60,000

దోపిడీకి దళారులు ప్రయత్నాయాలు..

వానాకాలంలో సేద్యానికి సిద్ధమైన రైతులను నకిలీ విత్తనాల గండం ఏటా ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అన్నదాత అవసరాలు, అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు మాయగాళ్లు నకిలీ, కల్తీ విత్తనాలు అంటగట్టి రైతులను నిండా ముంచి జేబులు నింపుకొంటున్నారు. రైతులపై కొత్త కొత్త ప్రయోగాలు చేసేందుకు పలు విత్తన కంపెనీలు సైతం రంగంలోకి దిగాయి. కేంద్రం నిషేధించిన బీజీ 3 విత్తనాలను కొందరూ అక్రమార్కులు ఇప్పటికే గ్రామాల్లో తరలించినట్లు సమాచారం. అయితే లైసెన్స్ ఉన్న వ్యాపారుల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, అదమరిస్తే మొదటికే మోసం వస్తుందని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. విత్తనాల కొనుగోలు చేయడమే తప్ప వాటి స్థితిగతులను గమనించలేకపోవడంతో రైతులు ఏటా నష్టపోవాల్సి వస్తోంది. ముఖ్యంగా పత్తి, వరి, మొక్కజొన్న వంటి విత్తనాలను కొనుగోలు చేసే సమయాన అప్రమత్తంగా వ్యవహరిస్తే లాభాల బాట పట్టచ్చొని అధికారులు సూచిస్తున్నారు.

సూచనలు పాటించాలి..



ముందస్తుగా విత్తనాలు మొలకెత్తే శాతాన్ని.. ప్యాకెట్‌పై చూసుకొని కొనుగోలు చేసి విత్తుకోవాలి. లైసెన్స్ వ్యాపారుల వద్ద మాత్రమే విత్తనాలు కొని రసీదు తీసుకొని.. డీలర్ బుక్‌లో సంతకం చేయాలి. విత్తన ప్యాకెట్ కవర్‌ను భద్రపరుచుకోవాలి. మిషన్ కుట్టు ఉన్న ఎరువును మాత్రమే కొనాలి. అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి.

–శంకర్, మండల వ్యవసాయశాఖ అధికారి

చర్యలు తీసుకోవాలి..



గతంలో నకిలీ విత్తనాల బారిన పడి అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోయిన దాఖలాలు ఉన్నాయి. ఈ సారైనా రైతులకు న్యాయమైన విత్తనాలు లభించే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. నకిలీ, నాణ్యతలేని, ప్రభుత్వం నిషేధించిన బీజీ3 పత్తి విత్తనాలను విక్రయించే వ్యాపారులపై దృష్టిపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి.

– రమేష్ రాథోడ్, గ్రీన్ ఎర్త్ సొసైటీ అధ్యక్షుడు

రామయ్య సేవలో జెన్‌కో సీఎండీ



రామయ్యను దర్శించుకున్న టీఎస్ జెన్‌కో సీఎండీ

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీసీతారామచంద్ర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర జెన్‌కో, ట్రాన్స్ కో చైర్మన్ డి.ప్రభాకర్‌రావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ప్రధాన అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి శాలువతో సత్కరించి, జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు.

కిన్నెరసాని సందర్శన

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని ఆదివారం టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా జలాశయాన్ని, పార్కులోని దుప్పులను వీక్షించి చివరగా బోటు షికారు చేశారు. కిన్నెరసాని రిజర్వాయర్ నీటిమట్టం వివరాలను సీఈ ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. సీఎండీతోపాటు డైరెక్టర్లు లక్ష్మయ్య, అజయ్, టీఆర్‌కే.రావు, సచ్చిదానందం, వెంకటరాజం, టెక్నికల్ సీఎండీ హనుమాన్, ఓఎస్‌డీ వినోద్‌కుమార్‌లు కుటుంబ సభ్యులతో కలిసి కిన్నెరసానిలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ సీఈలు ప్రభాకర్‌రావు, వి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసబాబు, ఎస్ఈ మొక్షంవీర్, ఏడీఈ రామకృష్ణ, ఏఈ సురేష్, ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా కిన్నెరసానికి ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరాగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.10,905 , టూరిజం శాఖకు రూ.11,080 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



కిన్నెరసానిలో బోటింగ్ చేస్తున్న జెన్‌కో సీఎండీ తదితరులు

నిరుద్యోగాన్ని పెంచి పోషించేది పాలకులే..



సభలో మాట్లాడుతున్న సాగర్

టేకులపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తున్నాయని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోల లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా అధ్యక్షుడు చింత నరసింహారావు అధ్యక్షతన జరిగిన ప్రగతి శీల యువజన సంఘం 8వ మహాసభలో వారు మాట్లాడారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. ఉద్యోగ నోటిఫికేషన్ల పేరుతో రూ.కోట్లు వసూలు చేస్తూ ఉద్యోగాలు మొత్తం అప్పై అప్పై నో రిప్లైగా మారిందన్నారు. కొట్లాడి సాధించుకున్న బంగారు తెలంగాణలో ఇంటికో ఉద్యోగం వస్తుందన్న యువకుల ఆశలపై నీళ్లు చల్లారని, విచ్చలవిడిగా మద్యం షాపులకు అనుమతులు ఇచ్చి యువకులను ప్రశ్నించే తత్వం నుంచి మద్యం వైపుకు మళ్లించారని, ఆడపిల్ల పగటిపూట కూడా బయటికి వెళ్తే తిరిగొచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ఈ తరుణంలోనే ప్రగతిశీల యువజన సంఘం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ఉద్యోగ క్యాలెండర్లు విడుదల చేయాలని, ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి జూలై 4, 5 తేదీల్లో ఇల్లెందులో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు డి.ప్రసాద్, గొని నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, రామచంద్రు, పీవైఎల్ జిల్లా నాయకులు అటికం శేఖర్, లాజర్, ముసలి సతీష్, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులతో జెడ్పీ చైర్మన్ సమావేశం



కాంగ్రెస్ నాయకులతో కోరం కనకయ్య

టేకులపల్లి: వచ్చే నెల మొదటి వారంలో కాంగ్రెస్ పార్టీలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య చేరనున్న నేపథ్యాన భారీ జన సమీకరణపై దృష్టి సారించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత లక్కినేని సురేందర్‌రావు నివాసంలో కోరం కనకయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఖమ్మంలో జరిగే సభకు భారీగా జనాన్ని తరలించే విషయమై చర్చించినట్లు సమాచారం. అనంతరం మండలంలోని పలువురిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఇస్లావత్ రెడ్యానాయక్, పూనెం సురేందర్, బానోత్ భద్రు, సొసైటీ డైరెక్టర్ ఉల్లోజు ఉదయ్, ఎంపీటీసీ ఊకె రామకృష్ణ, దేవ్‌సింగ్, ఈది గణేష్, మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణకు దారి తీసిన భూ వివాదం

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిపై దాడి, కారు ధ్వంసం
- పోలీసులను ఆశ్రయించిన ఇరువర్గాలు

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యవసాయ భూమికి సంబంధించిన వివాదం ఘర్షణకు తీసింది. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మండలంలోని మల్లాయిగూడెం గ్రామ పంచాయతీ అధికార పార్టీ సర్పంచ్ నారం రాజశేఖర్ తండ్రికి గ్రామానికి సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి ఇదే గ్రామానికి చెందిన బీఎస్పీ పార్టీ మండల నాయకుడు సంగం దుర్గారావుకు, సర్పంచ్ కుటుంబీకుల మధ్య గడిచిన ఏడాదిగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం వివాదాస్పద పొలంలో దుర్గారావు ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నేందుకు ప్రయత్నించగా, విషయం తెలుసుకున్న సర్పంచ్ ఇతని అనుచరులు అక్కడికి చేరుకొని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మడకం ప్రసాద్ దొర తనపై బీఆర్ఎస్ సర్పంచ్ అనుచరులు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. అలాగే తన కారును సైతం సర్పంచ్ అనుచరులు ధ్వంసం చేసినట్లు చెప్పారు. దీనిపై సర్పంచ్ మాట్లాడుతూ.. పొలాన్ని దున్నుతుంటే అడ్డుకొగా, దాడి చేశామని మడకం ప్రసాద్ దొర ఆరోపిస్తున్నారని, ఘటన స్థలానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కారును తన అనుచరులు ఏ విధంగా ధ్వంసం చేస్తారని సర్పంచ్ ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇరు వర్గాలు అశ్వారావుపేట పోలీసులను ఆశ్రయించారు. ఇరు వర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

చెట్టు దెబ్బకు రూ.1.50 లక్షల నష్టం

- ఎండిపోయి ఉండడంతో విరిగిపడిన భారీ చెట్టు
- 17 విద్యుత్ స్తంభాలు నేలమట్టం
- పలు గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా



విరిగిపడిన కరెంట్ స్తంభం

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ భారీ చెట్టు విరిగిపడి ఆదివారం విద్యుత్ స్తంభాలు నేలమట్టం అయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వాగొడ్డగూడేనికి సమీపంలో గల గంగరాజు సతీష్ అనే రైతు పామాయిల్ తోట దగ్గర తెల్లవారు జామున వీచిన పెనుగాలులతో ఎండిపోయి ఉన్న ఓ భారీ వృక్షం నేలమట్టం అయ్యింది. ఇదే మార్గంలో ఉన్న పాపిడిగూడెం, అనంతారం గ్రామాలకు వెళ్లే విద్యుత్ ఫీడర్‌కు సంబంధించిన 17 కరెంట్ స్తంభాలు ఒక్కసారిగా విరిగిపోయాయి. కరెంట్ స్తంభాలు, వైర్లు ప్రధాన రహదారిపై పడిపోగా.. ఈ సమయాన జన సంచారం, వాహనాల రాకపోకలు లేకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో విద్యుత్‌శాఖకు సుమారు రూ.1.50లక్షల వరకు నష్టం వాటిల్లింది. కాగా, సాయంత్రం వరకు విద్యుత్ స్తంభాలను పునరుద్ధరణ చేయకపోవడంతో ఆయా ఫీడర్ల పరిధిలోగల వాగొడ్డుగూడెం , పాపిడిగూడెం, రామన్నగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం, మల్లాయిగూడెం, కొండతోగు, అనంతారం గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపోయింది. ఎండిపోయిన చెట్టును అధికారులు ముందుగానే గుర్తించి తొలగించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

నైటింగేల్‌కు సన్మానం

కొత్తగూడెంరూరల్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట ప్రాథమిక వైద్యశాల ఏఎన్ఎం తేజావత్ సుశీలను రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ఆదివారం సన్మానించారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలో జరిగిన కార్యక్రమంలో సుశీలను సన్మానించాక గడల మాట్లాడారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని మారుమూల గ్రామాలలో ఉండే గొత్తికోయల ఆవాసాలకు సుశీలవెళ్లి వైద్య సేవలు అందిస్తున్న ఆమె సేవలు గర్వనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం హయాంలో మారుమూల గ్రామాల్లోనూ మంచి వైద్యం అందుతుందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సుశీలను సన్మానిస్తున్న గడల శ్రీనివాస్

అటవీ అధికారిని దూషించిన వ్యక్తిపై కేసు

పాల్వంచ: అటవీ అధికారిని దూషించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడు గ్రామంలో పూనెం ప్రకాంత్ అనే వ్యక్తి ఇంటి వద్ద కర్రలు ఉండడంతో వాటి గురించి ప్రశ్నించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉమాదేవిని ప్రకాంత్ దుర్భాషలాడాడు. ఈమేరకు బీట్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి..

ఎద్దును తప్పించబోయి అదుపుతప్పిన బైక్



పార్థసారథి (ఫైల్)

జూలూరుపాడు: ఎద్దును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు వదిలాడు. స్థానికుల కథనం ప్రకారం .. వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఎర్రగోపుల పార్థసారధి(26) అలియాస్ బాబీ వెల్డింగ్ షాపులో పని ముగించుకొని ఆదివారం బైక్‌పై సాయిబాబా ఆలయం వైపు నుంచి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు.ఈ క్రమంలో పెట్రోల్ బంక్ సమీపానికి రాగానే ఎద్దు ఒక్కసారిగా అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు క్షతగాత్రుడిని సమీపంలో ఓ ఆస్పత్రికి ఆపై కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్..

బూర్గంపాడు: బూర్గంపాడు మండలం పోలవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు పట్టణంలోని రాజుపేటకు చెందిన సిరికొండ శ్రీనివాస్(43) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పాల్వంచ నుంచి మణుగూరుకు ఆటోలో వెళ్తున్న క్రమంలో పోలవరం గ్రామం వద్ద ముందు వెళ్తున్న గేదెలను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్‌ను స్థానికులు మోరంపల్లిబంజర పీహెచ్‌సీకి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. ఆటోలో శ్రీనివాస్‌తో పాటుగా ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని బూర్గంపాడు సివిల్ ఆస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొని వైల్డ్‌లైఫ్ బీట్ అధికారి మృతి

కొత్తగూడెంరూరల్: లారీ ఢీకొనడంతో ఓ వైల్డ్ లైఫ్ బీట్ అధికారి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చాతకొండరేంజ్ మొట్లగూడెం బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న టేకులపల్లి మండలం బోరింగ్‌తండా గ్రామానికి చెందిన మోతిలాల్(48) తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా ఉన్న లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఏరియా ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె..

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాకబంజర గ్రామంలో మంద్రు రాంబాబు గేదె ఆదివారం పొలంలో మేస్తుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగ తగిలి మృతి చెందింది. మృతిచెందిన గేదెను హర్యానా నుంచి తీసుకొచ్చానని విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరుతున్నాడు.

బాలుడి ప్రాణం తీసిన ఈత సరదా



మృతిచెందిన నవీన్

ఇల్లెందురూరల్: చెరువులో సరదాగా ఈత కొడదామని వెళ్లి ఓ బాలుడు మృత్యువాత పడిన సంఘటన ఇది. మండలంలోని పోలారం గ్రామ పంచాయతీ బొంబాయితండా గ్రామంలో తనుగోర్ నవీన్ (11) ఆదివారం సాయంత్రం చెరువులో ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెరువులో ఈత కొట్టి చేపలు పట్టుకుందామని ముందుస్తుగా మాట్లాడుకున్న నవీన్, అతని ఇద్దరు స్నేహితులు చెరువు వద్దకు బయలుదేరారు. సరదాగా కొద్దిసేపు ఈతకొట్టారు. ఇంతలో తమతోపాటు వచ్చిన నవీన్ కనిపించకపోవడంతో స్నేహితులు కంగారుగా ఇంటికి వచ్చారు. రాత్రి అయినా నవీన్ ఇంటికి రాకపోవడంతో తండ్రి వెంకన్న కుమారుడి ఆచూకీ కోసం అతడి స్నేహితులను అడుగగా.. జరిగిన విషయం చెప్పారు. వెంటనే వెంకన్న గ్రామస్తులతో కలిసి చెరువు వద్దకు వెళ్లి వెతకగా.. నవీన్ భౌతికకాయం కనిపించడంతో ఇంటికి చేర్చారు. ఇదిలా ఉండగా గతేడాది పాము కాటుకు గురైన నవీన్‌కు రూ.2లక్షల వరకు ఖర్చు చేశారని, మూడు రోజుల క్రితమే మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో చేర్పించారని గ్రామస్తులు తెలిపారు. సోమవారం పాఠశాలకు వెళ్లాల్సిన నవీన్ ఈత సరదాతో తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



పులకరిస్తున్న 'గడప'!

- 83,83,908 గృహాలను సందర్శించిన ఏపీ ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: ఓట్లు దండుకుని మొహం చాటేసిన మనుషులనే ఇన్నాళ్లూ చూశాం! ఎన్నికలు ముగియగానే మేనిఫెస్టోను మాయం చేసి చెత్తబుట్ట పాలు చేసిన పార్టీల గురించే మాకు తెలుసు! అధికారం చేపట్టాక ప్రజా సమస్యలను గాలికి వదిలేసి గ్రామాల వైపు తిరిగి చూడని నేతల పాలనలో దశాబ్దాల పాటు నలిగిపోయాం! మళ్లీ ఎన్నికలు వస్తే గానీ మా గుమ్మం తొక్కని నాయకులతో విసిగిపోయాం! అలాంటిది.. చరిత్రలో తొలిసారిగా 99 శాతం హామీలను నెరవేర్చి చిరునవ్వుతో, ఆత్మవిశ్వాసంతో మా గుమ్మం వద్దకు వస్తున్న ప్రజా ప్రతినిధులను ఇప్పుడే చూస్తున్నాం..! ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఇంకా ఏమైనా సమస్యలున్నాయా?.. ఆశీర్వదించండంటూ ఆత్మీయంగా గడప గడపనూ పలుకరిస్తున్న నాయకులను చూడటం ఇదే మొదటిసారి అని ఏపీ ప్రజానీకం పేర్కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంతో ప్రతి గడప పులకరిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ఈ నెల 20వతేదీ నాటికి ఎమ్మెల్యేలు 83,83,908 గృహాలను సందర్శించారు. ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాలను వివరించి వారి ఆశీర్వాదాలను పొందారు. రాష్ట్రంలోని మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలకుగానూ ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు 9,316 సచివాలయాలను సందర్శించారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయాల వారీగా పర్యటిస్తూ ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుంటున్న ఎమ్మెల్యేలు ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన మేలును వివరిస్తూ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని ఆరా తీస్తూ ఆయా కుటుంబాలతో టిక్ పెట్టిస్తున్నారు. ప్రతి ఎమ్మెల్యే సచివాలయాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించడంతో పాటు స్థానికంగా ప్రజలకు అవసరమైన, ప్రాధాన్యత కలిగిన పనులను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున అత్యంత ప్రాధాన్యత పనులను గుర్తించి వెంటనే మంజూరు చేస్తున్నారు.

నిస్తేజం.. గందరగోళం!

పవన్ కళ్యాణ్ వైఖరితో జనసేన శ్రేణుల్లో అయోమయం

- వివాదాల సుడిగుండంలో వారాహి యాత్ర.. టీడీపీతో పొత్తు ప్రస్తావనతో పడిపోయిన గ్రాఫ్
- దానిని నిలబెట్టుకునే ఎత్తుగడతో బోల్తా
- సవాళ్లను స్వీకరించకుండా పలాయన మంత్రం
- అజెండా లేకుండానే ఉమ్మడి 'తూర్పు'న ముగింపు
- వ్యక్తిగత విమర్శలతో మసకబారిన అభిమానం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దశ, దిశ నిర్దేశం లేకుండానే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారాహి యాత్ర ముగిసింది. తూర్పు సెంటిమెంట్‌గా ఈ నెల 14న అన్నవరం సత్యదేవునికి పూజలు నిర్వహించి, పవన్ ఈ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో పార్టీ నిర్దిష్ట అజెండా గురించి తన నాయకుడు వివరిస్తారని భావించిన ఆయన అభిమానులకు నిరాశే ఎదురైంది. కాకినాడ జిల్లా కత్తిపూడి మొదలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఆదివారం జరిగిన ముగింపు సభ వరకూ వరుసగా వివాదాలు మూటగట్టుకున్నారు. సహజంగా ఏ రాజకీయ పార్టీ అయినా ఇటువంటి యాత్రలు చేసేటప్పుడు పార్టీ విధానపరమైన ప్రణాళికలను ప్రజల ముందు ఉంచుతుంది. తమకు ఓటేస్తే ప్రజలకు ఏం చేయదలుచుకున్నారో అర్థమయ్యేలా వివరిస్తూ.. వారి మనసు చూరగొనే ప్రయత్నం చేస్తుంది. పవన్ అభిమానులు, ఆ పార్టీ నేతలు ఆయన నుంచి ఇవే ఆశించారు. కానీ అందుకు పూర్తి భిన్నంగా వన్‌మేన్ ఆర్మీ మాదిరిగా ఉమ్మడి తూర్పు గోదావరిలో పవన్ తన యాత్రకు ముగింపు పలికారు. పార్టీకి ఒక అజెండా అంటూ లేకపోవడం జనసేన నేతలకు రుచించ లేదు.

ద్వారంపూడి, ముద్రగడపై విమర్శలతో పెనుదుమారం

వారాహి యాత్రలో పవన్ వ్యాఖ్యలపై పెనుదుమారం రేగింది. రెండవ సారి గెలుపొందిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వంటి నేతలే లక్ష్యంగా పవన్ ప్రసంగం సాగడం సొంత సామాజిక వర్గ నేతల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే, కాపు ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నేత ముద్రగడ పద్మనాభం లక్ష్యంగా పరోక్ష విమర్శలు చేయడం రాష్ట్ర స్థాయిలో పెనుదుమారాన్నే రేపింది. అటు ద్వారంపూడి, ఇటు ముద్రగడ సంధించిన అనేక ప్రశ్నలకు, వచ్చే ఎన్నికల్లో పోటీపై విసిరిన సవాళ్లకు పవన్ సమాధానం చెప్పకుండానే తోక ముడిచారనే విమర్శను మూటగట్టుకోవాల్సి వచ్చింది. గుండె ధైర్యం ఎక్కువని పదేపదే చెప్పుకునే ఆయన.. వారి సవాళ్లకు సరైన సమాధానం చెబుతారని ఎదురు చూశామని, తీరా చివరకు తల దించుకునేలా చేశారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఒక పక్క జనసేనకు కులాల అంతరాలు లేవంటూనే మరోపక్క తన ప్రసంగాల్లో కులాల ప్రస్తావనతో యువతలో పవన్ భావోద్వేగాలు రెచ్చగొట్టిన తీరును మేధావి వర్గం తప్పు పడుతోంది. పవన్ వాడిన పదజాలంపై రాజకీయాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న కాకినాడ ఎంపీ వంగా గీత 'రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు ఇదేనా మీరిచ్చే సందేశం' అంటూ చురకలు అంటించడం గమనార్హం.

అయినా.. మారలేదు

రీల్ లైఫ్‌కు, రియల్ లైఫ్‌కు చాలా తేడా ఉంటుందని చెబుతూనే ప్రసంగాలు, హావభావాల్లో పక్కా సినిమా స్టైల్‌ను ప్రదర్శించడంలో పవన్ ఔచిత్యాన్ని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. తాను సీఎం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని కత్తిపూడిలో చెప్పుకున్న పవన్.. పచ్చ మీడియా ఇంటర్వ్యూల్లో ఏదో అభిమానులు అలా అంటూంటే వారిని ఉత్సాహ పరిచేందుకు అలా మాట్లాడాననడం ఒక పార్టీకి నాయకత్వం వహించే నాయకుడి లక్షణమా అని వివిధ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. మార్పు రావాలని గొంతెత్తిన జనసేనాని తాను మారలేదనే విషయాన్ని వారాహి యాత్ర ద్వారా చెప్పకనే చెప్పారని ఆ వర్గాలు అంటున్నాయి. గోదావరి నేలను వదిలేది లేదని, ఈ జిల్లాలు రాజకీయ మార్పునకు నాంది పలుకుతాయని చెప్పిన పవన్.. వచ్చే ఎన్నికల్లో పోటీపై గత ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు కూడా పూటకో మాటతో అభిమానులను గందరగోళంలో పడేశారు.

ఆ పార్టీ నేతలే పెదవి విరుపు

మంగళగిరిలో తెలుగుదేశంతో పొత్తు అనగానే గోదావరి జిల్లాల్లో పవన్ గ్రాఫ్ పడిపోయింది. 80వ దశకంలో వంగవీటి మోహన్ రంగా హత్యోదంతం నుంచి.. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబం పైన, కాపు సామాజికవర్గం పైన చంద్రబాబు ప్రభుత్వం సాగించిన దమనకాండను గుర్తుకు తెచ్చుకుని.. సామాజిక మాధ్యమాల్లో పలువురు పవన్ తీరును ఏకి పారేశారు. ఆ వ్యతిరేకతను తగ్గించుకునేందుకో లేక కాస్తో కూస్తో బలం ఉన్న గోదావరి జిల్లాల్లో బలప్రదర్శన ద్వారా పొత్తుల్లో సీట్లు పెంచుకునేందుకో వారాహి యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాత్రలో తమకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని ఆ పార్టీ నేతలు పలువురు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. పుష్కర కాలంగా పార్టీ కోసం లక్షల రూపాయలు తగలేసుకుంటున్న ఇన్‌చార్జిలకు సైతం వారాహిపై వేదిక పంచుకునే అవకాశం ఇవ్వకుండా దూరం పెట్టడంపై నిప్పులు చెరుగుతున్నారు. మొత్తంగా ఉమ్మడి 'తూర్పు'న వారాహి యాత్ర అనేక వివాదాలు, అసంతృప్తులతో ఆ పార్టీ అభిమానులకు తీవ్ర నిరాశ మిగిల్చింది.

ప్రాణ రహిత!

▶ మొదటి పేజీ తరువాయి

మహాదేవ్ కొండల్లో జన్మించిన వెయిన్‌గంగా నది మహారాష్ట్రలోని వార్ధా, పెన్‌గంగా నదులను కలుపుకుంటూ తెలంగాణలో ప్రాణహిత నదిగా ప్రవేశిస్తుంది. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని సిరోంచా ప్రాంతంలో ఏర్పాటు చేసిన టెక్రా గేజ్ పాయింట్ వద్ద ప్రాణహితకు వచ్చే వరద లెక్కలను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డు చేస్తోంది. సీడబ్ల్యూసీ నివేదికల ప్రకారం 1964–65 నుంచి ఇప్పటివరకు వర్షాకాలంలో టెక్రా గేజ్ పాయింట్ వద్ద ప్రాణహితలో అత్యల్పంగా 444 క్యూసెక్కుల వరద 2005 జూన్ 21న నమోదైంది. అత్యధికంగా 3,90,416 క్యూసెక్కుల వరద 1981 ఆగస్టు 11న రికార్డు అయింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతోపాటు తెలంగాణలో పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొని ఉండటంతో ప్రస్తుత జూన్‌లో గరిష్ఠంగా 800 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చిందని, గత 65 ఏళ్లలో చాలా అరుదుగా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది జూన్‌లో ప్రాణహితకి 15.7 టీఎంసీల వరద రాగా ఈ ఏడాది 0.1 టీఎంసీకి మించలేదని అధికారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలున్న నేపథ్యంలో జూలై, ఆగస్టు నాటికి ప్రాణహితలో వరద ప్రవాహం పెరగొచ్చని నీటిపారుదల శాఖ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

నీటిపారుదల, వ్యవసాయ శాఖల సమావేశం

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టుల కింద వానాకాలం సాగుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ, నీటిపారుదల శాఖలు ఉమ్మడి సమావేశం నిర్వహించాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో గోదావరితోపాటు వార్ధా, ప్రాణహిత, ఇంద్రావతి వంటి ఉపనదులు తడారిపోయాయని నీటిపారుదల శాఖ నివేదించింది. వచ్చే నెల తొలి వారంలో పరిస్థితిని పునఃసమీక్షించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు సాగునీటి సరఫరాపై నిర్ణయంతీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది.

ఐటీ కొలువులకు 'వింగ్స్'

- గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జాబ్ ఫెయిర్
- విశాఖలో 21, 22 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు



బ్రోచర్, వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద నగరంగా విశాఖపట్నం భాసిల్లుతోంది. త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా కూడా ప్రత్యేకతను సంతరించుకోనున్న విశాఖపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ హబ్‌గా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు ముందుకేస్తోంది. దీంతో దిగ్గజ సంస్థలు విశాఖ వైపు ఆసక్తి కనబరుస్తున్నాయి. దీంతో ఐటీ సంస్థల్లో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ సహకారంతో విశాఖలో జాబ్ ఫెయిర్ నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జూలై 21, 22 తేదీల్లో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జరిగే ఈ కార్యక్రమానికి దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు హాజరుకానున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్, వెబ్‌సైట్‌ని విశాఖలో ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం ఆవిష్కరించారు.

త్వరలో దిగ్గజ సంస్థల కార్యకలాపాలు..

ప్రస్తుతం ఏపీలో దాదాపు 300కి పైగా ఐటీ కంపెనీలుండగా.. ఇందులో 80% వరకు విశాఖ కేంద్రంగానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 28న దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్.. డెవలప్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభించనుంది. ఇదే బాటలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో కూడా పయనించనున్నాయి. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో ఉన్న గ్రాడ్యుయేట్స్‌కు, ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు మధ్య బాండింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తోంది. ఏపిటా, రాష్ట్ర ఐటీ విభాగం సహకారంతో వి ఇన్ఫో టెక్నాలజీస్ ఆధ్వర్యంలో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023ని నిర్వహించనుంది. ఐటీ, ఐటీ అనుబంధ రంగ కంపెనీలకే కాకుండా.. ఫార్మా సంస్థలు, స్టార్టప్ సంస్థలకు ఏ విధమైన నైపుణ్యాలున్న మానవ వనరులు అవసరం?.. ఉద్యోగావకాశాలు పొందాలంటే ఎలాంటి కోర్సులు చేయాలి? టెక్నాలజీని ఎలా అందిపుచ్చుకోవాలి వంటి అంశాలను గ్రాడ్యుయేట్స్‌తో పాటు 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం. 'స్ప్రెడ్ యువర్ వింగ్స్' అనే పేరుతో 2 రోజుల పాటు విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన యువత నుంచి సీవీలు తీసుకొని.. అక్కడే ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. ఎంపికైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించ నున్నాయి. జాబ్‌ఫెయిర్‌కు టెక్‌మహీంద్ర, టీసీ ఎస్, ఎల్‌అండ్‌టీ, కాన్సెంట్రిక్స్, కాండ్యుయెంట్, చెగ్, డబ్ల్యూఎన్‌ఎస్, సెయింట్, పాత్రా, ఫ్లూయెంట్‌గ్రిడ్, పల్సస్ వంటి 40 వరకూ ఐటీ, అనుబంధ కంపెనీలు, ఫైజర్, అరబిందో వంటి 10 ఫార్మా సంస్థలు, 54 యూనివర్సిటీలు, కళాశాలలతో పాటు 10 స్టార్టప్ కంపెనీలు హాజరు కానున్నాయి.



ఏపీలో టీఎస్ ఆర్టీసీ బస్సు బోల్తా

పుల్లలచెరువు: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మురికిమళ్ల సమీపంలో రాష్ట్ర రహదారిపై ఆదివారం తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 24 మంది పెద్దలు, ఇద్దరు పిల్లలతో ప్రకాశం జిల్లా మార్కాపురానికి వస్తున్న హైదరాబాద్–1 డిపో బస్సు డ్రైవర్ ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో సడన్ బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పిన బస్సు రహదారికి అడ్డంగా బోల్తాపడింది. ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ ముందు అద్దాన్ని పగులగొట్టి దానిద్వారా ప్రయాణికులను బయటకు పంపారు. ప్రయాణికులు వేర్వేరు వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

జూలైలో తిరుమలలో విశేష ఉత్సవాలు ఇవే...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై నెలలో విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూలై 1న శని త్రయోదశి, 3న ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూజ, గురుపూర్ణిమ, 13న సర్వఏకాదశి, 15న శని త్రయోదశి, 17న శ్రీవారి ఆణివార ఆస్థానం, 22న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర, శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేయడం, 30న నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం ఉంటాయని తెలిపింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 83,889 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో రూ.3.10 కోట్లు సమర్పించుకున్నారు.

జిల్లా వార్తలు

ఏఈ రాత పరీక్షకు 87 మంది హాజరు



పరీక్షను పర్యవేక్షిస్తున్న సింగరేణి అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ సివిల్ (ఇంటర్నల్) పోస్టులకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని పర్సనల్ జీఎం(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షకు 94 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేయగా 87 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పూర్తిగా మెరిట్‌పై ఆధారపడి ఉంటుందని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని, వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్‌సైట్‌లో, సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంటాయని వివరించారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శారద, వివిధ విభాగాల అధికారులు పరీక్షను పర్యవేక్షించారు.

లింగనిర్ధారణతో గిర్ జాతి దూడ జననం



లింగనిర్ధారణ ద్వారా పుట్టిన దూడతో గోపాలమిత్ర, రైతు

నేలకొండపల్లి : పశువుల్లో సెక్స్‌డ్ సార్టెడ్ సెమెన్‌తో అవసరమైన దూడను పొందేలా కృత్రిమ గర్భధారణ చేసి నాటు ఆవుకు గిర్ జాతికి చెందిన ఆవు దూడను జన్మించేలా చేశారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన గోపాలమిత్ర యడవల్లి నర్సింహారావు గోకినేపల్లిలో రైతు కొమ్మినేని సుదర్శన్‌కు చెందిన ఆవుకు లింగ నిర్ధారణ చేసిన వీర్యాన్ని కృత్రిమ గర్భధారణ చేయించారు. ఈ విధానంతో రైతులు తమ పశువులకు ఆడ, లేక మగ జాతి దూడలను పొందే అవకాశం ఉందని వైరా వీర్య సేకరణ కేంద్రం ఈఈ డాక్టర్ కిషోర్ తెలిపారు. ప్రభుత్వం రూ.800 ఖర్చుతో సేకరించిన వీర్యాన్ని సబ్సిడీ ద్వారా రైతులకు రూ.250కి అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ శంకరయ్య పాల్గొన్నారు.

మత్తు.. వదిలితే భవిష్యత్తు..

- మత్తు పదార్థాల వినియోగంతో ఛిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- సరైన చికిత్సతోనే విముక్తి అంటున్న వైద్యులు
- నేడు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



గంజాయిని ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: మాదకద్రవ్యాలు మనిషి మానసిక స్థితిపై ప్రభావం చూపడమే కాకుండా శరీరంలోని అన్ని అవయవాలను అస్తవ్యస్తం చేస్తాయి. వాటికి బానిసలై ఒక్కసారిగా దూరమైన వారి ప్రవర్తన చాలాభిన్నంగా ఉంటుంది. వీటికి అలవాటు పడి ప్రాణాలు కోల్పోతున్న వారెందరో. ఇంతకు ముందు 25 ఏళ్ల వయస్సులో వ్యసనాలకు లోనైన వారు ఇప్పుడు పదహారేళ్లకే ఈ పదార్థాలు వాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. నేడు సమాజంలో ఎక్కువగా యువత మత్తుపదార్థాలకు బానిసవుతున్నది. మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా మానవాళిని రక్షించేందుకు, మాదకద్రవ్యాల వాడకం లేని సమాజాన్ని సృష్టించేందుకు ప్రమాణం చేసే లక్ష్యంతో జూన్ 26ను అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

బానిస కావడానికి కారణం..

మద్యం, కల్తీకల్లు, గుడుంబా, సిగరెట్, బీడీ, గుట్కా, జర్దా, తంబాకు, గంజాయి, బంగ్, నల్లమందు, కొకైన్, పెథిడిన్, హెరాయిన్, కొకైన్ వంటివాటితోపాటు ఇంకా చాలానే మాదవ ద్రవ్యాలు మారుపేర్ల రూపంలో మార్కెట్లో అమ్ముడుపోతూనే ఉన్నాయి. మొదటిసారి మత్తు పదార్థం తీసుకున్నప్పుడు అది నాడీ మండలానికి చేరి మెదడులోని నాడీ కణాలను ఉత్తేజపరుస్తుంది. తద్వారా డోపమైన్ అనే రసాయన పదార్థం విడుదలై మత్తుగా, హుషారుగా ఉన్నట్లుగా అనుభూతి పొందుతారు. ఈ అనుభూతి పొందే ప్రయత్నంలోనే బానిసలవుతారు. ఇందులో ప్రధానంగా యువకులే ఎక్కువగా ఉండడం విశేషం.

దుష్పరిణామాలు..

మత్తు పదార్థాలు నేరుగా మెదడుపైన, కేంద్ర నాడీ వ్యవస్థపైన ప్రభావం చూపుతాయి. వీటిని వాడుతుండే కొద్దీ శరీరంలోని ఇతర వ్యవస్థలపైనా దారుణమైన దుష్ప్రభావాలు చూపుతాయి. చివరకు అకాల మరణాలకు దారితీస్తాయి. ఊపిరితిత్తుల పనితీరు మందగిస్తుంది. రోగనిరోధక శక్తి వ్యవస్థ బాగా దెబ్బతింటుంది. శరీరం శుష్కించిపోతుంది. లివర్‌పై ఒత్తిడి ఏర్పడి, పని చేయని స్థితి ఏర్పడుతుంది. గుండె వేగంలో మార్పులు వస్తాయి. రక్తప్రసరణకు ఆటంకాలు ఏర్పడతాయి. జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. మూర్ఛ, పక్షవాతం వంటివి వస్తాయి. ఎదురుగా ఏం జరుగుతుందో అర్థం చేసుకోలేని గందరగోళం ఏర్పడుతుంది. మాదకద్రవ్యాలు సేవించడం కారణంగా అనవసరమైన గొడవలకు దారి తీయడం, ఆ మత్తులో ఎవరిని ఏం చేస్తున్నామో, ఏం అంటున్నామో తెలియకపోవడం లాంటి గందరగోళ స్థితిగతులను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొంతకాలంగా జరిగిన కొన్ని సంఘటనలే దీనికి నిదర్శనం.



అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న, భద్రాచలం టౌన్ సీఐ నాగరాజురెడ్డి (ఫైల్)

రవాణాలోనూ యువత పాత్ర..

కొంతకాలంగా యువత మత్తు పదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటోంది. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, విద్యాభ్యాసం చేస్తున్న కొందరు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. వారు స్వస్థలాలకు వచ్చి ఇక్కడి వారికి అంటగడుతున్నారు. అరికట్టడానికి పోలీస్ శాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. పూర్తిస్థాయి ఫలితాలు రావడం లేదు. ఇటు భద్రాచలంతో పాటు జిల్లావ్యాప్తంగా గంజాయి మత్తులో చేసిన ఘటనలు చూస్తేనే అర్థం అవుతోంది. గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతోంది ఎక్కువ శాతం యువకులే. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు ఒక్క భద్రాచలంలోనే దాదాపు 1,300 కేజీల గంజాయిని అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారంటే జిల్లావ్యాప్తంగా చూస్తే దీని కంటే ఇంకా ఎక్కువే ఉండవచ్చు.

కఠిన చర్యలు తప్పవు...



ఎవరైనా మాదకద్రవ్యాలను విక్రయించినా, వాటితో పట్టుబడినా కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేస్తాం. ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా ఎవరైనా మత్తు పదార్థాలను సరఫరా చేస్తే ఉపేక్షించేది లేదు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే పలు ప్రాంతాలను మా సిబ్బంది, అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు.

–పరితోష్ పంకజ్, ఏఎస్పీ భద్రాచలం

మత్తుకు దూరంగా ఉండాలి



మత్తు పదార్థాలు తీసుకోవడంతో అనేక సమస్యలు ఎదురవుతాయి. కుటుంబాల్లో కలహాలు, దంపతుల మధ్య గొడవలు వస్తాయి. జీవితంలో ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది. మత్తుకు బానిసైన వారు మానసిక వైద్యుల పర్యవేక్షణలో చికిత్స చేయించుకోవడంతో విముక్తి పొందవచ్చు.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

క్రీడా స్ఫూర్తి చాటాలి

జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు



నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తున్న జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

పాల్వంచ/మణుగూరు రూరల్: విద్యుత్ ఉద్యోగులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, పోటీతత్వం వ్యక్తిత్వానికి ఎంతో అవసరం అని జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు అన్నారు. మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. నూతనంగా నిర్మించిన ప్రాజెక్ట్ వసతి భవనాన్ని ప్రారంభించారు. ఉద్యోగుల రెసిడెన్షియల్ టౌన్ షిప్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఆ తర్వాత బీటీపీఎస్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, ప్లాంట్ నిర్వహణపై సీఈ బిచ్చన్నను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం పాల్వంచ టీఆర్‌సీ టెన్నిస్ గ్రౌండ్‌లో జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమష్టి కృషితో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే విద్యుత్ ఉత్పాదనలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో నిలుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వ కృషితో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసేంతగా ఎదిగిందని వివరించారు. మణుగూరులో చిన్నారులు నిర్వహించిన ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాల్వంచలో జరిగిన క్రీడా పోటీల్లో కేటీపీపీ, విద్యుత్ సౌధ, శ్రీశైలం, బీటీపీఎస్, నాగార్జున సాగర్, కేటీపీఎస్ 5,6,7 దశల క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం ఉమెన్స్‌కు షటిల్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్, టేబుల్ టెన్నిస్, పురుషులకు లాన్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెన్‌కో డైరెక్టర్లు టీఆర్‌కే.రావు, ఎం.సచ్చిదానందం, వెంకటరాజం, ఎ.అజయ్, బి.లక్ష్మయ్య, సీఈలు పి.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసబాబు, బి.బిచ్చన్న, పి.రత్నాకర్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్ ఆనంద్, గేమ్స్ సెక్రటరీ వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, ఇంజనీర్లు పార్వతి, రాంప్రసాద్, సూర్యనారాయణ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



చెస్ పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



మాట్లాడుతున్న జయలక్ష్మి

సత్తుపల్లిటౌన్/సింగరేణి(కొత్తగూడెం): ఐసీడీఎస్‌ను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు బడ్జెట్‌ను పెంచి బలోపేతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలపై చేపట్టిన రాష్ట్ర జీపుజాతా ఆదివారం సత్తుపల్లి, కొత్తగూడెం పట్టణాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను పలుమార్లు కోరినా, ఆందోళన చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా జరిగే పోరాటాల్లో అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పొరుగు రాష్ట్రాల్లో అంగన్‌వాడీలకు ఇచ్చే వేతనాలు, ఇతర సౌకర్యాలు తెలంగాణలో అందడం లేదని ఆరోపించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సైతం అంగన్‌వాడీల వేతనాల్లో 60 శాతం కోత విధించిందని, సుప్రీం కోర్టు ఇచ్చిన గ్రాట్యుటీ అమలు చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయటం లేదని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు చలమాల విఠల్, ఎం.చంద్రశేఖర్, కొలికపోగు సర్వేశ్వరరావు, ఉదయ్‌శ్రీ, షకీన, నాగేంద్ర, విజయ, కమల, ఆదిలక్ష్మి, రోజా, లలిత, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.